అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 23 జులై 2023

అదనపు కలెక్టర్ రాహుల్ ఆకస్మిక తనిఖీ

మందమర్రి : మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిషనల్ కలెక్టర్ రాహుల్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఊరు మందమర్రి ట్యాంక్ బండ్‌ని పరిశీలించి వాటిపై జరగబోయే పనుల వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. కేసీఆర్ పార్కు, వెంకటేశ్వర గుడి వెనక ప్రాంతంలోని మున్సిపల్ నర్సరీ, శ్మశనవాటిక నిర్మాణం దాదాపుగా పూర్తి కావస్తున్నటువంటి మహిళా భవన్, కమ్యూనిటీ హాల్, సెంట్రల్ డివైడర్ పనులను తొందరగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు, డివైడర్ల మధ్యలో ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ అచ్యుత్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం గోపీకృష్ణ, సిస్టం మేనేజర్ శిరీష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



గిరిజన మహిళలపై లైంగికదాడి అవమానకరం

నవతెలంగాణ-సారంగాపూర్

మణిపూర్‌లో మహిళలపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటన దేశానికే అవమానకరమని దళిత సంఘ నాయకులు డాక్టర్ దండు సాయన్న అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను కటినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగం సాయన్న, ఎస్టీ మండల కోఆర్డినేటర్ వినీత్ తలారి, కొండ రమేష్, మాకునుర్ సతీష్, పతాని రాజు, నరేష్ పాల్గొన్నారు.



అధిక వర్షం..అపార నష్టం..!

- జిల్లాలో విరామం లేకుండా కురుస్తున్న వానలు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు
- తీర ప్రాంతాలను చుట్టుముట్టిన వరద నీరు
- జల దిగ్బంధనంలో చిక్కుకున్న పలు గ్రామాలు
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- తీర ప్రాంత ప్రజలను అలర్ట్ చేస్తున్న అధికారులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. నాలుగు రోజులుగా నిరంతరం కురుస్తున్న వానలకు జిల్లావాసులు వణికిపోతున్నారు. నదులు, వాగులు ఉగ్రరూపం దాల్చి తీర ప్రాంతాలను ముంచెత్తాయి. దీంతో జిల్లాలోని పలు పల్లెలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇండ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లోని గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా, వార్ధా తదితర నదులతో పాటు ఆయా గ్రామాల సమీపంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వంతెనలు, కల్వర్టుల పై నుంచి వరద నీరు ప్రవహించడంతో రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న పంట పొలాలు నీటిలోనే మునిగిపోయాయి. కడెం ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ అవుట్ ఫ్లో కూడా అదే మాదిరి ఉందని అధికారులు చెబుతున్నారు. మిగితా అన్ని ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు రావడంతో అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలిపెడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షం ఇలాగే కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతుండటంతో ఆందోళన రేకెత్తిస్తోంది.


డోలార వద్ద పెన్‌గంగ ఉగ్రరూపం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అంతరాయం లేకుండా కురుస్తున్న వర్షాలు ఉమ్మడి జిల్లాను వణికిస్తున్నాయి. శుక్ర,శనివారాల్లో క్షణం తీరిక లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాని నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో తీర ప్రాంతాలు జలమయమయ్యాయి. సమీప గ్రామాలను వరద నీరు చుట్టుముట్టడంతో జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున పెన్‌గంగా నది వంతెనకు సమానంగా ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. బేల మండలం సాంగిడి గ్రామం వరదనీటిలో చిక్కుకుంది. బెందోడ, కాంగార్‌పూర్, గూడ, దహెగాం తదితర గ్రామాల చుట్టూ వరద నీరు చేరింది. ఈ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జైనథ్ మండలం కోర్ట, కేదార్‌పూర్ తదితర గ్రామాలది ఇదే పరిస్థితి కనిపిస్తోంది. భీంపూర్ మండలంలోని ధనోర, అంతర్గావ్, పిప్పల్‌కోటి గ్రామాల సమీపంలోని వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదిలాబాద్ గ్రామీణ మండలం బంగారుగూడ వాగులో కొట్టుకొచ్చిన ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. జైనథ్ మండలం లేఖర్‌వాడలో శివారు ప్రాంతంలోని ఇండ్లలోకి వర్షపునీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా అనేక పల్లెల్లో ఈ సమస్య కనిపించింది. భీంపూర్ మండలం వడూర్ సమీపంలోని పెన్‌గంగాలో దాదిబా అనే వ్యక్తి కొట్టుకుపోతుండగా స్థానికులు కుషాల్, శ్రీనివాస్‌లు గమనించి ఆయన్ను కాపాడారు.

భారీ వర్షపాతం నమోదు

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు భారీ స్థాయిలో వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కుమురంభీం జిల్లా సిర్పూర్(యు)లో 227.0మి.మి వర్షపాతం నమోదైంది. జైనూర్‌లో 189.0మి.మి, లింగాపూర్‌లో 217మి.మి, కడెంలో 200మి.మిలు, పెంబిలో 148.4మి.మిలు, దస్తురాబాద్‌లో 105.5మి.మిలు, ఆదిలాబాద్ గ్రామీణ మండలంలో 133.5మి.మి, ఆదిలాబాద్ పట్టణంలో 131.0మి.మిలు, మావల మండలంలో 120.8మి.మి వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాల్లోని ఇండ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


బేల మండలం బెదోడ వద్ద వరద నీరు


జైనథ్ మండలం నిరాలలో నీట మునిగిన పంట పొలాలు

నీటిలోనే పంట పొలాలు..!

అన్నదాతల ఆశలు పంటలు వర్షార్పణమవుతున్నాయి. వారం రోజుల క్రితం వరకు వర్షాలు రావడంతో పంటలు ఎదుగుతాయని ఆశపడిన అన్నదాతలకు తాజాగా నిరంతరం కురుస్తున్న వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నదీ తీర ప్రాంతాల్లోని పంట పొలాలు మొత్తం మునిగిపోయాయి. ముఖ్యంగా పెన్‌గంగా నది ఉగ్రరూపం దాల్చడంతో సమీప గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట పొలాలు మునిగిపోయాయి. అనేక చోట్ల పత్తి, సోయా మొక్కలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. వర్షం ఆగకపోవడం.. రోజుల తరబడి నీటిలోనే ఉండిపోవడంతో మొక్కలు మురిగిపోయే ప్రమాదం ఉంటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సంబంధిత మండల అధికారులతో వర్షాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ చెబుతుండటంతో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈవీఎంలపై అవగాహన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఓటర్లకు ఈవిఎం, వివి ప్యాట్‌లపై అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఓటు ప్రాముఖ్యత గురించి సర్పంచ్ ముత్యంరెడ్డి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తురాబాద్ : మండలంలోని దేవునిగూడెం, ఆకొండపేట్ గ్రామాలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సర్పంచులు అంజన్న, పోషలింగం ఆధ్వర్యంలో శనివారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈవీఎంలో ఓటింగ్ వేసే విధానాన్ని ఓటర్లకు వివరించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటుకు ఉన్న విలువ, ప్రాధాన్యతను తెలిపారు. వివిప్యాట్‌లో ఓటు నమోదుపై క్షేత్రస్థాయిలో తాహసీల్దార్ లక్ష్మి అవగాహన కల్పించారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ తెలంగ్‌రావు, ఆర్ఐ వెంకటనరసయ్య పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబ సభ్యులకు పరామర్శ



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మడె శంకర్ అనారోగ్యంతో శనివారం ఉదయం మరణించారు. ఈ విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తనయుడు బీఆర్ఎస్ నాయకుడు కోవ సాయినాథ్ పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సింగిల్‌విండో చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు. బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఆజ్మీరా ఆత్మారాం నాయక్ సైతం సర్పంచ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, నాయకులు ఉన్నారు.

పలు పనులకు స్థల సేకరణ

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డులో కోటి రూపాయల నిధులతో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, క్రీడా మైదానం, అంగన్వాడీ భవనం, దోబీఘాట్ నిర్మాణాల కోసం మున్సిపల్, సింగరేణి అధికారులతో కలిసి స్థల సేకరణ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చిడం మహేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ సహకారంతో ఏడో వార్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

రైతులకు పంటనష్ట పరిహారం అందించాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని టిపిసిసి రాష్ట్ర(గిరిజన విభాగం) ఉపాధ్యక్షులు భరత్ చౌవాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని పాటగూడ, వడగావ్, జైత్రాం తదితర గ్రామాల్లో పర్యటించారు. భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్లు, కల్వర్టులు వాగు పరివాహక ప్రాంత పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి జరిగిన నష్టంపై వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సర్వే చేపట్టాలని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి లక్ష రూపాయల నష్టరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ తులసీరాం పలువురు రైతులు ఉన్నారు.

హత్యలకు కారణమైన ప్రభుత్వాన్ని రద్దు చేయాలి

రెబ్బెన : మణిపూర్‌లో హత్యలకు కారణమైన అక్కడి ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశాడు. శనివారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల మణిపూర్‌లో ఆదివాసీ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరణకాండకు కేంద్ర బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వమే కారణమని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో సున్నితమైన వాటిలో మణిపూర్ ఒకటని, తమ హిందుత్వ విధానాలను ముందుకు తీసుకుపోవడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నం చేయడమే ఈ ఘర్షణలకు మూలమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శివ, జిల్లా కమిటీ సభ్యులు స్రావణి, మండల నాయకులు కృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

విరమణ ఉద్యోగికి చెక్కు అందజేత

రెబ్బెన : గోలేటిలోని జీఎం కార్యాలయంలో మెడికల్ ఇన్‌వాలిడేట్ అయిన ఉద్యోగి తూముల శ్రీనివాస్‌కు చెక్కు(ఏకమొత్తం)ను బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ అందజేశారు. గోలేటి సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తూ తూముల శ్రీనివాస్ ఇటీవల మెడికల్ ఇన్‌వాలిడేట్ అయ్యారు. కుమార్తె, కుమారుడికి కారుణ్య నియామకం ద్వారా సింగరేణిలో ఉద్యోగ అవకాశం ఉంది. కానీ వారు ఉన్నత చదువులు చదివి మంచి వేతనంతో కూడిన ఉద్యోగం చేస్తున్నారు. ఏకమొత్తం డబ్బులు రూ.25లక్షల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పన్నుల మినహాయింపు కాగా మంజూరైన రూ.20.30 లక్షల చెక్కును జీఎం అందజేశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, టీబీజీకేయస్ ఫిట్ కార్యదర్శి గడ్డం రవీందర్ పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో ముందుండాలి : జోగు ప్రేమేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సమస్యలు తలెత్తిన పుర అధికారులను తక్షణమే సంప్రదించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా పట్టణంలోని పలు కాలనీలలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. జీఎస్ ఎస్టేట్, తాటిగూడ, గడియార్ మహల్, కేఆర్‌కే, హ్యాండిక్యాప్ కాలనీలలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లోని పలువురి ఇండ్లల్లో నీరు వచ్చి చేరడంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పలు చోట్ల నీటి ప్రవాహాన్ని బయటకు పంపేందుకు అప్పటికపుడు జేసీబీల ద్వారా పనులు చేయించారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను పలువురు చైర్మన్ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలిస్తున్నామని, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని అన్నారు. ఎటువంటి సమస్యలున్నా తమను సంప్రదిస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు పందిరి భూమన్న, కొండ గణేష్, సంజయ్ ఉన్నారు.



ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ- జైనథ్

అధిక వర్షాలతో పంటలు నీట మునిగి నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం జైనథ్ మండలంలోని పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలోని నీట మునిగిన పంటలను పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పత్తి, సోయా పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. రైతుల ఇప్పటికే రెండు సార్లు విత్తనాలు వేశారని, ఎరువులు, పురుగు మందులు చల్లారని ఈ తరుణంలో ఎడతెరిపి లేని వర్షాలు రావడం రైతులను ఇబ్బందులకు గురిచేసిందని పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఉచితంగా అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలని, కొత్తగా రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ముకినేపల్లి గంగన్న, జైనథ్ మండల నాయకులు దోని వెంకట్ తదితరులున్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు సూచించారు. శనివారం ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి, కిష్టాపూర్, వేలాల, పౌనూర్ గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. వర్షాలు కురిసినప్పుడు వరద నీరు రోడ్ల మీద నిల్వకుండా చూడాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని తెలిపారు. బయోటెక్ స్ప్రే చేయించడంతో పాటు నీటి నిల్వలు ఉన్నప్పుడు నీటిలో ఆయిల్ బాల్స్ తయారు చేసి వేయాలని తెలిపారు. పారిశుధ్య కార్మికులు విధులకు హాజరుకానందున గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనలు ఆగిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని తెలిపారు. సానిటేషన్ కార్మికులతో పనులు చేయిస్తూ మురుగు కాల్వలను శుభ్రం చేయించడం, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింట చెత్త సేకరణ, ప్లాస్టిక్ చెత్త ఉండకుండా చూడాలని తెలిపారు. ప్లాస్టిక్ చెత్తను విక్రయించి గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేయాలని సూచించారు. షాపుల ముందు, రోడ్డుపై ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలు పడవేసిన వారికి జరిమానా విధించాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ ఉన్నారు.

కడెం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ప్రవాహం



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టుకు శనివారం కూడా వరద ప్రవాహం కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రాజెక్టులోకి చేరుతున్న ఇన్‌ఫ్లోకు తగ్గట్టుగా గేట్లు ఎత్తుతున్నారు. శనివారం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు అధికారులకు కాస్త ఉపశమనం లభించింది. 13వ నెంబర్ గేట్ పనులు దాదాపు శనివారం పూర్తవుతుందని, మరో మూడు రోజుల్లో ప్రాజెక్టు పనులన్నీ పూర్తవుతాయని సీఈ శ్రీనివాస్ తెలిపారు. 2,3 గేట్లకు కౌంటర్ వెయిట్ బిల్లలను మూడు రోజుల్లో బిగిస్తామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 5గంటల సమయంలో ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో 69416 క్యూసెక్కులు కాగా 14 వరద గేట్లు ఎత్తి 77,476 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేశారు. శనివారం సందర్శకుల తాకిడి పెరిగింది.

నీటిని వేడి చేసి, వడకట్టుకొని తాగాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలనీలో నివసించే ప్రజలు నీటిని వేడి చేసి, వడకట్టుకొని తాగాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరిలో వరద నీరు వచ్చిందని, సింగరేణి యాజమాన్యం నీటిని శుద్ధి చేసి ఉద్యోగుల సౌకర్యార్థం అన్ని కాలనీలకు పంపుల ద్వారా పంపిస్తోందని తెలిపారు. ఈ నీటిలో కొద్దిగా మార్పులు గమనించామని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురు పిల్లలకు గాయాలు

నవతెలంగాణ - దహెగాం

మండలంలో శనివారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి ముగ్గురు పిల్లలను రెండు వేరువేరు గ్రామాల్లో దాడులు చేసి గాయపరిచాయి. ఐనం గ్రామానికి చెందిన తుమ్మి మనోజ్(4), అదే గ్రామానికి చెందిన నక్క హరీష్(10) గాయపరచగా, అలాగే రాళ్లగూడ గ్రామానికి చెందిన రోహిని ప్రవళికపై కూడా పిచ్చికుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో దహెగాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. వీరంతా వారివారి ఇండ్ల ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్కలు దాడిచేసినట్టు కుటుంబీకులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో పిచ్చికుక్కల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే వాటిని పట్టుకొని తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

ముథోల్ : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ శివారులో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేసి టేకు చెట్లు నరికారు. ఎస్ఐ చాకచక్యంతో దొంగలు పట్టుబడ్డారు. ఎస్సై సాయికిరణ్, గ్రామస్తుల వివరాల ప్రకారం...ముథోల్‌కు చెందిన కోనుపాక్ మధుకర్ రైతుకు చెందిన పొలంలో 20 సంవత్సరాల క్రితం పెట్టిన టేకు చెట్లను శుక్రవారం అర్ధరాత్రి బొలెరో వాహనంలో వచ్చి దొంగలు నరుకుతున్నారు. ఈ విషయం గమనించిన గ్రామస్తులు సంబంధిత రైతుకు సమాచారం ఇచ్చారు. వెంటనే రైతు ఎస్సైకి సమాచారం అందించారు. ఎస్సై తన సిబ్బందితో అర్ధరాత్రి వెళ్లి టేకు చెట్లను నరుకుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేశారు. మరో నలుగురు దొంగలు పారిపోయారు. పోలీసులు వెళ్లే లోపు దొంగలు అప్పటికే 24 టేకు దుంగలు నరికారు. ముగ్గురు దొంగలను అరెస్ట్ చేయడంతో పాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన దొంగలు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారని తెలిపారు. ఇదిలా ఉండగా ఇదే వ్యవసాయ క్షేత్రంలో గత నెల 26న రాత్రి సుమారు రూ.15లక్షల విలువ చేసే 24 టేకు దుంగలను దొంగలు ఎత్తుకుపోయారు.

అంబేద్కర్ సంఘ నాయకుడికి పరామర్శ

తలమడుగు : ప్రమాదంలో గాయపడ్డ కజర్ల గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘం నాయకుడు ప్రవీణ్‌ను శనివారం మాల సంక్షేమ సంఘం నాయకులు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ తలకు బలమైన గాయాలు కావడంతో అదే రోజు హైదరాబాద్ తరలించి వైద్యం చేయించారు. శనివారం గ్రామానికి రాగా విషయం తెలుసుకున్న మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్లూరి భూమన్న, నాయకులు హర్ష దేవిదాస్, గంపల ప్రభాకర్, శశికాంత్, కుమ్మరి సత్యనారాయణ, హర్ష రమేష్, క్రాంతి, సాయిబాబా, కృపావరం, సురమానంద్, కుట్ల రమేష్, సూర్య వరప్రసాద్, శ్రీనివాస్ పరామర్శించారు.



గ్రామపంచాయతీ కార్మికులకు జడ్పీటీసీ మద్దతు

నవతెలంగాణ-కడెం



గ్రామపంచాయతీ కార్మికులకు కడెం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి మద్దతు తెలిపారు. శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు నేరేళ్ల మహేష్, ఉపాధ్యక్షులు గోవింద్, క్యాషియర్ మహేందర్, నర్సయ్య, నల్వాల గంగాధర్, రాములు, నరేష్, గంగన్న, పోశలింగు పాల్గొన్నారు.

కూలిన సీలింగ్.. తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



భారీ వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సీలింగ్ తడిసి శనివారం పడిపోయింది. ఆస్పత్రిలో 2, 5వ అంతస్తులోని ఎక్స్ పాన్షన్ జాయింట్ పడిపోవడంతో ఆ సమయంలో అక్కడ ఎవ్వరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా సంఘటన స్థలాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ వైద్యులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి మరమ్మతు పనులు త్వరగా చేపట్టాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి ఓపీఎస్ పునరుద్ధరణ ఐక్య సదస్సును జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

నేడు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీసీ రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరణకై ఆదివారం నిర్వహించే రాష్ట్ర స్థాయి ఐక్య సదస్సు జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ అన్నారు. టీఎన్‌జీఓ భవనం ఆవరణలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైల్వే బ్యాంకింగ్, డిఫెన్స్, ఇన్సూరెన్స్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని, సదస్సును జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బక్కన్న, మురళి, రాజేందర్, రమేష్, ఎన్‌పీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మణిపూర్ ఘటన దుండగులను కఠినంగా శిక్షించాలని మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం మణిపూర్ ఘటనను వ్యతిరేకిస్తూ అమర వీరుల స్థూపం వద్ద కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ పరిపాలన జరుగుతోందని ఆరోపించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బాబన్న, కార్యవర్గ సభ్యులు ఆర్ష దేవిదాస్, శశికాంత్, ప్రభాకర్, సత్యనారాయణ, శ్రీనివాస్, సాయిబాబా, సూర్య వరప్రసాద్, ఆనంద్, కుట్ల రమేష్, క్రాంతి పాల్గొన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు సేవలు మరువలేనివి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన పి.రాంబాబు సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా భద్రాచలం బదిలీ అయిన సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబును శాలువాలతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. జిల్లాలో 2 సంవత్సరాలకు పైబడి రెవెన్యూ వ్యవహారాలలో చాకచక్యంగా పనిచేసి విశేష సేవలు అందించారని కొనియాడారు. అలాగే రెవెన్యూ డివిజనల్ అధికారి స్రవంతి అదిలాబాద్ జిల్లాకు బదిలీ అయిన సంద్భంగా శాలువాలతో సన్మాంచి మేమోంటో అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లోకేష్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్, మండల పరిషత్ అభివృద్ధి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నూతన కలెక్టరేట్‌కు బస్సు సౌకర్యం

నవతెలంగాణ-నిర్మల్

నూతన కలెక్టరేట్ వరకు బస్సు సౌకర్యాన్ని ఆర్టీసీ అధికారులు కల్పించారు. శనివారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశానుసారం నిర్మల్ బస్టాండ్ నుంచి నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయం వరకు సోమవారం నుంచి బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపోమేనేజర్ ఎస్. సాయన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్మల్ బస్టాండ్ నుంచి ఉదయం 10 గంటలకు మంచిర్యాల చౌరస్తా నుంచి ఏఎన్ రెడ్డి కాలని కమాన్, దివ్యనగర్ కమాన్, నట్‌రాజ్ మిల్ గుండా బయలు దేరుతుందని తెలిపారు. తిరిగి సాయంత్రం 5.45 నిమిషాలకు కలెక్టరేట్ నుంచి బయలు దేరి నిర్మల్ బస్టాండ్ చేరుకుంటుందని డిపోమేనేజర్ పేర్కొన్నారు. బస్సు ఛార్జి రూ.20 ఉంటుందని, నెలవారీ రూట్ పాస్ తీసుకుంటే రూ.850 అవుతుందని, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

బురదమయంగా ప్రభుత్వాస్పత్రి రోడ్డు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారిందని, ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని బీజేపీ నాయకులు రాథోడ్ బిక్కు ఆరోపించారు. శనివారం ఉమ్మడి మండలంలోని పీహెచ్‌సీకి వెళ్లేదారి బురుదమయంగా మారండంతో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రికి రోగులు, అంబులెన్స్‌లు వెళ్లాలంటే బురదలో తిప్పలు పడుతున్నారని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వారం రోజుల్లోగా రోడ్డు వేయాలని అన్నారు. లేని పక్షంలో అధికార పార్టీ నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు శీను, అక్షయ్, ధర్మరక్షక్, రణ్వీర్, మహేష్, కపిల్ ఉన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పిప్రి, దేవాపూర్, గ్రామాల్లోని ఓటర్లకు శనివారం అవగాహన కల్పించామని తహసీల్దార్ గంగాధర్ అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల పనితీరు వేసే ఓటు వినియోగంపై వివరించారు.

సీఎంఆర్ లక్ష్యాలను గడువులోగా ఎఫ్‌సీఐకి అందించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో సీఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ఎఫ్‌సీఐకి అందించాలని జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్ అధికారులతో సీఎంఆర్ సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ డెలివరీ చేసేందుకు సరిపడా గోదాంలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని మిల్లర్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వర్షాలు, హమలీల కొరత వలన సీఎంఆర్ బియ్యాన్ని సకాలంలో అందించలేక పోతున్నామని తెలిపారు. 2023 ఖరీఫ్, రబీ సీజన్‌ల సీఎంఆర్ సేకరణకు 2లక్షల 12 వేల మెట్రిక్ టన్నులు సీఎంఆర్ రావాల్సి ఉందని అన్నారు. సామర్థ్యం గల గోడౌన్ కావాల్సి ఉందని, డిచ్‌పల్లితో పాటు ఆదిలాబాద్ తదితర వాటికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. సీఎంఆర్ డెలివరీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. బియ్యం నిల్వలకు సరిపోను గోదాములను కేటాయించాల్సిన బాధ్యత ఎఫ్‌సీఐపై ఉన్నందున తగిన ఏర్పాటు సకాలంలో చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని మిల్లర్లూ చేరుకోవాలని ఆన్నారు. మిల్లులకు కేటాయించిన ధాన్యం నిలువలను పరిశీలించాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు, రైస్ మిల్లర్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేట్టాలి

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్ట రాహుల్ రాజ్ అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి, వర్షాభావ పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల, గ్రామ స్థాయి అధికారులు స్థానికంగా ఉండాలని అన్నారు. ఎప్పటికప్పుడు వర్షాభావ పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాజెక్టులలో చేరే వరదనీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దిగువకు విడుదల చేయాలని అన్నారు. పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలనీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తక్షణ సహాయ చర్యల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 1800-425-1939 కు ప్రజలు సంప్రదించాలని తెలిపారు. చెరువులు, ప్రాజెక్టుల లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని అన్నారు. అధిక వర్షపాతం నమోదవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నీటి పరివాహక ప్రాంతాలకు వెళ్లకూడదని, అత్యవసరమైతే తప్పబయటికి వెళ్లవద్దని సూచించారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు ఈ రోజు, రేపు సెలవు ప్రభుత్వం పొడగించినందని, వసతి గృహాల్లో పిల్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని విద్యా, సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. రహదారులు దెబ్బతిన్న చోట, వరద నీరు ప్రవహించే ప్రాంతాలను ఎప్పటికప్పుడు పోలీస్, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్డీఓ కిషన్, డీఈఓ ప్రణీత, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాణాభివృద్ధిపై చిత్తశుద్ధి లేని పాలకవర్గం

- మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



ఖానాపూర్ పట్టాణాభివృద్ధిపై పాలకవర్గానికి చిత్తశుద్ధి లేదని ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు అవినీతి, అక్రమాలనే పనిగా పెట్టుకొని పాలన సాగిస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్మెన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పట్టణాభివృద్ధికి ఆటంకంగా మారారని ఆరోపించారు. చైర్మెన్, వైస్ చైర్మెన్ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నట్లుగా నటిస్తూ, చీకటి ఒప్పందంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. పాలకవర్గం కొలువుదీరి మూడున్నరేండ్లు గడిచిందని అన్నారు. పట్టణంలో పార్క్ నిర్మాణం తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. కాంట్రాక్టర్‌ను డబ్బులు డిమాండ్ చేయడం కారణంగానే పట్టణంలో రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోయాయని అన్నారు. పనులను సకాలంలో జరిపించాల్సిన పాలక సభ్యులే పనులు నిలిచి పోవడానికి కారకులై ప్రజలకు ఇబ్బంది కల్పిస్తున్నారని విమర్శించారు. పట్టణంలో ఎవరైనా ఇండ్లు కట్టుకుంటే సదరు వ్యక్తి నుంచి కౌన్సిలర్లు లక్షల్లో వసూలు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కౌన్సిలర్లు చేస్తున్న ఒత్తిడికి తట్టుకోలేక కొందరు ఇండ్లు కట్టుకోవడాన్ని వాయిదా వేసుకున్నారని తెలిపారు. ప్రజల సమస్యలపై బాధ్యతగా ఉండాల్సిన కౌన్సిలర్లు తరచుగా మున్సిపల్ సమావేశాలను బైకాట్ చేస్తున్నట్టు ప్రకటించి, చేతులు దులుపుకోవడం దేనికని ప్రశ్నించారు. వీరి చర్యల వల్ల పట్టణాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు పట్టణం ఎంతో బాగుండేదని తెలిపారు. సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో ఉండాల్సిన పాలక సభ్యులే అభివృద్ధికి ఆటంకంగా మారడాన్ని ప్రజలు సహించరని విమర్శించారు. మున్సిపల్ సమావేశానికి నాలుగు సార్లు హాజరు కాని సదరు సభ్యులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాని, ప్రజల బాగుకోసం అవసరమైతే హైకోర్టుకు వెళ్తానని హెచ్చరించారు.

సురక్షిత వసతి గృహానికి విద్యార్థుల తరలింపు



నవతెలంగాణ-తాంసి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కప్పర్ల గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని గదుల్లో వర్షపు నీరు చేరడంతో వసతి గృహ విద్యార్థులను మండల కేంద్రంలోని వసతి గృహానికి స్పెషల్ ఆఫీసర్ కిరణ్, జెడ్పీ సీఈఓ గణపతి, మండల అధికారులతో కలిసి వసతి గృహాన్ని పరిశీలించి తరలించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల వసతి గృహం, ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లోని వంట గదులు, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కప్పర్ల వసతి గృహంలో పదిహేను మంది విద్యార్థులను ముందు జాగ్రత్తలో భాగంగా మండల కేంద్రంలోని వసతి గృహానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లోనీ గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న గదుల్లో విద్యార్థులు ఉండకుండా చూసుకోవాలని, మరుగు దొడ్లు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. వంట గదులు శుభ్రంగా ఉంచాలని, కుళ్లిపోయిన పండ్లు కూరగాయలు ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రాజేశ్వర్ రాథోడ్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ భూమయ్య, డీటీ బాబుసింగ్, వార్డెన్ నారాయణరెడ్డి, అర్ఐ మహేందర్, సురేందర్ ఉన్నారు.

కాలనీల్లో పర్యటించి... సమస్యలు తెలుసుకొని..

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో పర్యటించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో డ్రైనేజీ, రోడ్డు సమస్యలపై స్పందించి వార్డు నెం.15 ఆదర్శనగర్ మసీద్ ప్రాంతంలో పర్యటించారు. కాలనీవాసులకు ఉన్న ఇబ్బందులు ఆడిగితెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా వర్షపు నీరు కాలనీ రోడ్లపై నిలిచిపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నామని దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే చైర్మెన్ జేసీబీ సాయంతో తాత్కాలికంగా డ్రైనేజీ పనులు దగ్గరుండి చేయించారు. వర్షాలు తగ్గిన తర్వాత డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం అభివృద్ధి పనులు చేపట్టి, కాలనీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన మున్సిపల్ కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్‌కి 7993396793 కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. చైర్మెన్ వెంట కమిషనర్ సీవీఎన్ రాజు, ఏఈ హరిభూవన్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం భైంసా సివిల్ కోర్టు జడ్జి దేవేంద్రబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యాలయంలో ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. అనంతరం వంటగది పరిశీలించి, స్టాక్ రిజిస్టార్ తనిఖీ చేసి, మెనూ వివరాలు తెసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాలలోని, భోజన, తదితర సౌకర్యాల గిరించి అడిగి తెలుసుకున్నారు. జడ్జీ వెంట ఎస్సై సాయికిరణ్, పాఠశాల సిబ్బంది, ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బంగారుగూడ వాగులో శనివారం మృత దేహం లభ్యమైంది. స్థానికులు, ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగూడ గ్రామ శివారులోని వాగులో గుర్తు తెలియని, దాదాపు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న పురుషుని మృతదేహం లభ్యమైంది.వైట్ బ్లాక్ షర్ట్, బ్లాక్ పాయింట్ కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లుతుండటంతో ఓ చెట్టు పొదలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయినట్లు పేర్కొన్నారు. ఎవరైనా తెలిసిన వారు వెంటనే అదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ సెల్‌నెంబర్ 8712659924.సంప్రదించాలని తెలిపారు.

అల్లర్ల సూత్రధారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మణిపూర్‌లో అల్లర్ల సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమైక్య ఆదిలాబాద్ కన్వీనర్ మెస్రం భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహికంగా లైంగికదాడి చేసి, హత్య చేయడం దారుణమైన సంఘటన పేర్కొన్నారు. ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని తెలిపారు. సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరిపించాలపి కోరారు. మతోన్మాద శక్తుల వలన దేశంలో మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట నారాయణ మాట్లాడుతూ కరోనాకాలంలో సైతం హమాలీ కార్మికులు ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక భూమిక నిర్వహించారని అన్నారు. హమాలీ కార్మికులు సరుకుల రవాణాలో నేటికీ ముఖ్యపాత్ర నిర్వహిస్తారని అన్నారు. వీరు లేకపోతే ఇప్పుడున్న వ్యవస్థ ముందుకు సాగడం కష్టమని అన్నారు. రాత్రింబవళ్లు హమాలీ కార్మికులు పనిచేస్తూనే ఉంటారని కనీస సదుపాయాలు, వేతనాలు, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలను కల్పించాలని అన్నారు. పని స్థలాలలో కనీస సౌకర్యాలను కల్పించాలని అన్నారు. ఇల్లు లేని హమాలీ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు సహాయక చర్యల్లోనే ఉంటాం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు సహాయక చర్యల్లోనే ఉంటామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అదిలాబాద్ రూరల్ మండలం జందాపూర్‌లోని నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు. అనంతరం జందాపూర్ నుంచి కరంజి పోయే రోడ్డును స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సందర్శించారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. భారీ వర్షాల వలన ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చేపట్టాలని అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు.

సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

- ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-నిర్మల్

సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైన తమ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ బాధితులు తక్షణమే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. అలా చేస్తే పోయిన సెల్‌ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని అన్నారు. సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకున్న 09 సెల్‌ఫోన్‌లను వాటి యజమానులకు అందజేశారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్బి ఇన్స్‌పెక్టర్ అజయ్ బాబు, ఐటీకోర్ ఇన్‌చార్జ్ రవి కుమార్‌తో పాటు ఐటీకోర్ విభాగం సిబ్బంది, సెల్‌ఫోన్‌ల యజమానులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
ఆదివారం 23 జులై 2023

సీఐటీయూ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కాగజ్ నగర్ పట్టణంలో ఆగస్టు 6న నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ కోరారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తో కలిసి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల మహాసభలో విస్తృత చర్చ జరుగుతుందన్నారు. కార్మికుల ఎజెండాగా నిర్వహించే మహాసభలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, ఓదెలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

జన్నారం : మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సీతారాం అనే నిరుపేద కుటుంబానికి శనివారం దేవరకొండ రాజు కుమార్ రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. సీతారాం కుటుంబం కడు పేదరికంలో ఉంది అతనికి ఇద్దరు కుమార్తెలుండగా అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో ఈ చిరు సాయాన్ని అందజేసినట్టు తెలిపారు. దాతల ముందుకు వచ్చి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహైల్‌షా, మనోహర్‌రావు తిరుపతి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ అన్నారు. ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త, కంటెం తిరుపతి భార్య అనారోగ్యం బారినపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంలో అతనికి రూ.5000 ఆర్థిక సాయం అందించి మానవతాన్ని చాటుకున్నారు.

వర్షం తగ్గింది.. వరద మిగిలింది

- ఉప్పొంగిన వాగులు స్తంభించిన రవాణా
- కొనసాగుతున్న అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పోలిస్తే శనివారం వర్షం తగ్గింది. అయినప్పటికీ గత మూడు రోజులుగా కురిసిన వర్షాలతో వరద ముంచెత్తాయి. జిల్లాలోని జైనూరు, సిర్పూర్, లింగాపూర్ మండలాల్లో కురిసిన వర్షానికి కింద ప్రాంతాల్లో పలు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి.

నిలిచిన రాకపోకలు.. స్తంభించిన రవాణా వ్యవస్థ

జిల్లాలోని సిర్పూర్(యూ) మండలంలోని అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఆసిఫాబాద్ మండలంలోని తుంపెల్లి వాగు, డోర్లీ పరిసర ప్రాంతంలో ఉన్న వాగు శనివారం ఉప్పొంగి ప్రవహించాయి. 6 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రం నుండి తిర్యాని మండల కేంద్రానికి వెళ్లడానికి ప్రధాన రహదారి కావడంతో ప్రజలు వాగుల వద్ద నిలిచిపోవాల్సి వచ్చింది.

కొనసాగుతున్న అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

గత మూడు రోజుల వర్షంతో అడ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువలకు వదులుతున్నారు. అధికారులు శుక్రవారం ఆరు గేట్లు ఎత్తి నీటిని వదులుతుండగా, శనివారం నాటికి ఒక గేట్ మూసి 5 గేట్ల ద్వారా నీటిని కిందికి వదిలారు. సాయంత్రం వరకు 3, 4, 5, 6, 7 నెంబరు గల గేట్లను 0.80 మీటర్లు ఎత్తి 8155 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా సాయంత్రం వరకు 237.200 మీటర్లకు చేరుకొంది. ప్రాజెక్టు సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ఇప్పటివరకు 5.516 టీఎంసీలకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 12439 క్యూసెక్కులు గా ఉంది. దీనితో 5 గేట్లు ఎత్తి 8155 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం

జిల్లాలో శనివారం అక్కడక్కడ వర్షం కురియగా అధికారుల లెక్కల ప్రకారం శుక్రవారం ఉదయం నుండి శనివారం ఉదయం వరకు జిల్లాలో సగటు వర్షపాతం 72 మిల్లీ మీటర్లు నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జైనూర్‌లో 178.6 మీ.మీ. వర్షపాతం కురియగా సిర్పూర్(యు)లో 222.4, లింగాపూర్‌లో 217.4, తిర్యానిలో 30.4, రెబ్బెనలో 23.2, ఆసిఫాబాద్‌లో 23.2, కెరమెరిలో 100.6, వాంకిడిలో 40.6, కాగజ్‌నగర్‌లో 28.4, సిర్పూర్(టి)లో 38.4, కౌటాలలో 24.6, చింతలమానపెల్లి 66.8, బెజ్జూర్‌లో 25.6, పెంచికలపేట 29.6, దహెగాం 30.6 మీ.మీ. ల వర్షపాతం కురిసింది.

నేలకొరిగిన భారీ వక్షాలు

జన్నారం : గత ఐదు రోజుల్లో అలా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పోలీస్‌స్టేషన్ సమీపాన ఉన్న జన్నారం వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అలాగే మండలంలోని మర్రిగూడ, మహమ్మదాబాద్ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతగూడ గ్రామ సమీపాన బొమ్మెన గ్రామం వద్ద ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలడంతో స్థానిక పోలీసులు జేసీబీ సహాయంతో తొలగించారు. మండలంలోని కొత్తపేట, కవ్వాల్ గ్రామానికి మధ్య ఉన్న రోడ్డు పూర్తిగా వరదలో కొట్టుకపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ గ్రామాల మధ్య ఉన్న వాగుపై వంతెన నిర్మించాలని ఆ గ్రామ సర్పంచ్ మలావత్ లావణ్య ప్రేమ్ సింగ్ కోరారు. మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీలోని మందపల్లి వీరాచారికి చెందిన పురాతన పెంకుటిల్లు కూలిపోవడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి నిత్యవసర సరుకులు పూర్తిగా తడిసిపోయాయి. దాదాపు రూ.1,50,000 వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న జన్నారం వాగు ఉధృతంగా ప్రవహించి పక్కనే ఉన్న బుడగ జంగాల కాలనీలో ఉన్న ఇళ్లలోకి నీరు చేరడంతో వారిని స్థానిక పోలీసులు సర్పంచ్ జక్కు భూమేష్ పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే సేవాదాస్‌నగర్‌లో భారీ వృక్షం రోడ్డుపై కూలడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు రెండు నెలకొరిగాయి. విద్యుత్తు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నూతన స్తంభాలు వేసి విద్యుత్ను పునరుద్ధరింపజేశారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలం అతలాకుతలమైంది. ఎలాంటి ప్రాణ నష్టం పంట నష్టం జరగలేదని తహసీల్దార్ కిషన్ పేర్కొన్నారు.


జన్నారంలో నేలకొరిగిన వృక్షం


ఆసిఫాబాద్‌లో అడ ప్రాజెక్టు

కుంగిన కల్వర్టు నిలిచిన రాకపోకలు

వేమనపల్లి : గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మల్లంపేట్, నీల్వాయి ప్రధాన రహదారి మధ్య ఉన్న కల్వర్టు భారీ వర్షాలకు కృంగిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారిపై ఉన్న ఈ కల్వర్టు కోతకు గురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న నీల్వాయి ఎస్సై సుబ్బారావు సంఘటన స్థలానికి చేరుకొని వాహన రాకపోకులను నిలిపివేశారు. రోడ్డు మరమ్మత్తులు చేసేవరకు ప్రజలెవరు రహదారి గుండా ప్రయాణించరాదని సూచించారు. సంఘటన స్థలం వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.

ప్రమాదకరంగా మోతిపటార్ వంతెన

జైనూర్ : లింగాపూర్ మండలంలోని మోతిపటార్ గ్రామ పంచాయతీ పరిధిలో గల వంతెన శనివారం కురిసిన భారీ వర్షానికి ప్రమాదకరంగా మారింది. ప్రజలు వెంటనే నూతన వంతెన మంజూరుచేసి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు. మోతిపటార్ గ్రామం నుంచి ప్రతిరోజు మండలకేంద్రానికి రావాలంటే ప్రధాన రోడ్డు గుండా ఉన్న వంతెన తెగిపోయే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. అటుగా వెల్లాలంటేనే గ్రామస్తులు బయాందోళనకు గువుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, ప్రజలు, రైతులు మండలకేంద్రానికి రావడానికి రాకపోకలు ఇబ్బందులు కల్గుతున్నాయని వాపోతున్నారు. వంతెన పైనుండి వరద నీరు పారడంతో లింగాపూర్ ఎస్సై సందీప్, సర్పంచ్ జాదవ్ పద్మనాను, స్థానిక యువజన సభ్యులు గ్రామస్తులకు రాకపోకలకు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.


వేమనపల్లిలో కోతకు గురైన రోడ్డు


జైనూర్‌లో దెబ్బతిన్న వంతెన

భిక్షాటన చేస్తూ జీపీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-హాజీపూర్

పంచాయతీ కార్మికుల సమ్మె శనివారం 17వ రోజుకు చేరింది. మండలంలోని ప్రజాప్రతినిధుల ఇండ్లల్లో భిక్షాటన చేస్తూ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సమ్మెను ఉధృతం చేయనున్నట్లు తెలిపారు.

కాసిపేట : మండల కేంద్రంలో శనివారం గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె 17వ రోజులకు చేరింది. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దాగం మల్లేష్, సహాయ కార్యదర్శి గట్టు సర్వేశం, జాడి పోచం, పులి శంకర్, దుర్గం సుధాకర్, దాగం రాయలింగు, బండారి సత్తయ్య, దుర్గం పోచం పాల్గొన్నారు.

కెరమెరి : జీపీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించడమే తప్ప కార్మికుల సమస్యల పై పట్టింపేదని కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డల వెంకటేశం ప్రశ్నించారు. జీపీ కార్మికులు చేస్తున్న నిరవధిక శనివారంతో 17వ రోజుకు చేరుకున్న సందర్భంగా చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమతో వెట్టిచాకిరి చేయించి, సమస్యలు పట్టించుకోక పోవడం విడ్డురమన్నారు. గ్రామాల పరి శుభ్రతలో ముఖ్య పాత్ర పోషిస్తున్న కార్మికులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానంలో కార్మికులను నియమించినప్పటి నుంచి కార్మికులు వివిధ రూపాల్లో నిరసన చేపట్టిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాథోడ్ రాందాస్, రామిల్ల నరేష్, తిరుసుల్ల సంతోష్, పొర్ల స్వామి, మల్లేష్, నగేష్, పాల్గొన్నారు.


హాజీపూర్‌లో నాయకుల ఇండ్లలో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

జన్నారం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు శనివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరం ఆవరణలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 17వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి రాజు, లచ్చన్న, రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

జైనూర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుడిమెత విశ్వనాథ్‌రావు అన్నారు. శనివారం సిర్పూర్(యు) మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగుతన్న జీపీ కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేపట్టి నేటికి 17 రోజులు కావస్తున్నా సమస్యలను పరిష్కరించేందుకు పాలకులు, అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కారోబార్‌లు సంజీవ్, కార్మికులు ఉన్నారు.

తాండూర్ : గ్రామపంచాయతీ కార్మికులు 17 రోజులుగా సమ్మెచేస్తున్న ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందనలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాతారి స్వామి అన్నారు. ఆయన శనివారం బెల్లంపల్లి పంచాయితీ కార్మికులకు మద్దతు తెలిపారు. పంచాయతీ కార్మికుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 మంది గ్రామపంచాయతీ ఉద్యోగులు మరణించారని వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు తొంగల మల్లేష్, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు బాకం మల్లేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గేల్లీ జయరాం, బండి లక్ష్మణ్, కనుకుంట్ల రాజేష్, రాకేష్ పాల్గొన్నారు.


కెరమెరిలో..


తాండూర్‌లో..

ఆర్కే-1ఏ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే-1ఏ గనిపై శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో గేట్ మీటింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ మాట్లాడుతూ ఆర్కే-1ఏ గని నడిపించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గతంలో నిరసనలు చేయడం జరిగిందని కానీ యాజమాన్యం పట్టిచుకోలేదని తెలిపారు. ఆర్కే-1ఏ కార్మికులను మందమర్రి ఏరియాలో ఉంచాలని ఇతర ఏరియాలకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలని మందమర్రి ఏరియా గనులలో పని చేస్తున్న ఉద్యోగులు వేరే ఏరియాకు పెట్టుకున్న ఉద్యోగులను కూడా చేయాలని ఆ ఖాళీలో ఆర్కే-1ఏ ఉద్యోగులను పంపించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అడగడం జరిగిందని తెలిపారు. దీనికి మందమర్రి జీఎం ఒప్పుకోవడం జరిగిందని కార్మికులందరూ వేరే ఏరియాకు ట్రాన్స్‌ఫర్ పెట్టుకోవాలని సూచించారు. ఆర్కే-1ఏ గనిలో ఐదు సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిక్షేపాలు ఉన్నా కూడా గని మూసివేస్తున్నారని, గుర్తింపు సంఘం స్థానిక ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఈ యొక్క గని మూసివేయడం ద్వారా రామకృష్ణాపూర్ ప్రజలు మందమర్రి ప్రజలు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. అలాగే వెంటనే లాభాల వాటా కార్మికులకు ఇవ్వాలని ఏరియర్స్ కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ ఇప్ప కాయల లింగయ్య, ఫిట్ సెక్రటరీ సురమల్ల వినయ్ కుమార్, కమిటీ సభ్యులు రాయముల్లు, గట్టయ్య, రాజు, రమేష్, కృష్ణ, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



వరద ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- తుంపల్లి వాగు సందర్శన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత మూడు రోజులుగా జిల్లాలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా వివిధ ప్రాంతాల్లో వస్తున్న వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మండలంలోని తుంపెల్లి వాగు ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్న నేపథ్యంలో వరద పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులపై వచ్చే వరదను దాటే ప్రయత్నం చేయకూడదని సూచించారు. వరద ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని కాపలా ఉంచేలా చూడాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రాబోవు రెండు రోజులు కూడా వర్ష సూచన ఉండటంతో వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, జిల్లా అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. వరద పరిస్థితులపై ప్రజల సౌకర్యార్థం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఏ విధమైన సహాయం కోసమైనా ప్రజలు కంట్రోల్ రూమ్ 9490534721, 9640378917 నెంబర్లలో సంప్రదించవచ్చని, అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, 24 గంటలు కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావ్ పాల్గొన్నారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యసాధనలో ముందుండాలి

- సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

వార్షికోత్పత్తి లక్ష్యసాధనలో ఎస్ఆర్పీ-3,3ఏ గని ముందుండాలని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ గురువయ్య, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, బెల్లంపల్లి రీజియస్ జనరల్ మేనేజర్ సేఫ్టీ హరి నారాయణ గుప్తాతో కలిసి డైరెక్టర్ 3,3ఏ గని ప్రణాళికలను పరిశీలించి గనిలోని 3ఎస్సి 2 డిస్ట్రిక్ 3 స్కీం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గని 2023-24 ఆర్థిక సంవత్సర వార్షిక ఉత్పత్తి లక్ష్యం 2.8 లక్షల టన్నులు వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి 4.4 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయవలసిన ఆవశ్యకత ఉందని, దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే గనిలో పనిచేస్తున్న ఉద్యోగులతో డైరెక్టర్ మాట్లాడుతూ తీసుకుంటున్న రక్షణ చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉద్యోగులందరూ వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించడం చాలా సంతోషకరమైన విషయం అని ప్రతి ఒక్కరూ రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను సాధించాలని, వ్యక్తిగత రక్షణతో పాటు తమ తోటి ఉద్యోగుల రక్షణ బాధ్యత కూడా మన పైన ఉందని ఉద్యోగులు గమనించి తమ విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, గని మేనేజర్ సంతోష్, గని ఇన్‌ఛార్జి, రక్షణాధికారి మహేందర్ పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పతాక దినోత్సవం

నవతెలంగాణ-మందమర్రి



జాతీయ పతాక దినోత్సవం సందర్భంగా శనివారం మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల వసతి గృహంలో విద్యార్థినిలకు జెండా రూపకర్త పింగళి వెంకయ్య గొప్పతనం, జెండా విశిష్టత గురించి పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆగుళ్ళ తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి కొక్కుల మధు, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గౌతమ్, లయన్ క్లబ్ సభ్యుడు బింగి రాజన్న, మొగిలి ఓదెలు, వసతి గృహం ఇన్‌ఛార్జి నుర్జాన పాల్గొన్నారు.

పీరీలు బంగ్లాకు షెడ్డు మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తమ గ్రామంలోని పీరీల బంగ్లాకు షెడ్డు మంజూరు చేయాలని జైనూరు మండలం పాట్నాపూర్‌లోని కరీంగూడాకు చెందిన మైనారిటీ నాయకులు శనివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కును క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'హసేన్ హుస్సేన్(పీరీలు)' పండగకు అనేక మంది భక్తులు వస్తారని వారికి అవసరమైన సౌకర్యాలు లేవన్నారు. హిందూ ముస్లింలకు పండుగ అయిన పీరిలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే నిమిత్తం షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీ వాసులు సజిద్, రహిమాన్, అబ్బాస్, ఫాషీద్, ముఖిద్, అస్లం ఖాన్, ఎస్కే ఆస్తా, ఇంతియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మణిపూర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర సాధించిన తర్వాత వజ్రోత్సవాలు జరుపుకుంటున్న భారతావనిలో ఆదివాసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళల రక్షణ పట్ల బీజేపీ ప్రభుత్వం కనీసం చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజల మధ్య కుల మత ప్రాంతాల చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకోవడమే కేంద్ర ప్రభుత్వ పనిగా మారిందని ఆరోపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెండాగూడ గ్రామ నాయకులు దుర్గం సచిన్, దుర్గం అభిజీత్, జాడి చిన్న పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జైనూర్

సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పాట్నాపూర్, లింగాపూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల వచ్చే రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్యంపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రి, సబ్‌సెంటర్‌కు వచ్చే రోగుల వివరాలను రోజూవారీగా నమోదు చేయాలని తెలిపారు. ఆస్పత్రిలో సమయపాలన పాటించి వైద్యమందించాలని సూచించారు. ఆస్పత్రిలో ఎలాంటి వైద్యుల కొరత సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలున్నా తనవంతుగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైద్యుడు రాజు, సూపర్‌వైజర్ లక్ష్మికుమారి, హెల్త్ అసిస్టెంట్ రమేష్ ఉన్నారు.

సీసీ రోడ్డు, కాలువ పనులు ప్రారంభం

నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట గ్రామ పంచాయతీలో శనివారం పంచాయతీ నిధులు రూ.4లక్షలతో సీసీ రోడ్డు, రూ.3లక్షలతో కాలువ నిర్మాణ పనులను సర్పంచ్ దరావత్ దేవి, ఉప సర్పంచ్ పిట్టల సుమన్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీలో సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దుర్గం భుమనమ్మ, గోనెల శ్రీలత, కార్యదర్శి రొడ్డ సౌందర్య పాల్గొన్నారు.



ప్రజల కోసమే జీవించిన సీఆర్ఆర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి ప్రజల కోసమే జీవించారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ అన్నారు. శనివారం సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ గొప్ప నాయకుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఉన్నారు.



అధిక వర్షంతో పొంగిన వాగులు రాకపోకలకు అంతరాయం


కూలిన ఇల్లును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నవతెలంగాణ-తలమడుగు

గత నాలుగు రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న అధిక వర్షాలకు శనివారం మండలంలోని పలు వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న పెద్ద వాగు వంతెనపై నుంచి నీరు పారగా అధిక నీటి ప్రవాహంతో నీటి ప్రవాహానికి చెట్ల మొద్దులు కొట్టుకు వచ్చి వంతెనకు తాకడంతో వంతెనపై నున్న సిమెంట్ పోర్లపైకి లేవడంతో ప్రమాదకరంగా మారింది. వెంటనే మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు వంతెనను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. లేనిపక్షంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశంతో పాటు ప్రమాదం చోటు చేసుకునే అవకాలున్నాయని పేర్కొన్నారు. తలమడుగు, సుంకిడి, డోర్లి, రుయ్యాడి, దేవాపూర్ వాగులపై నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదేవిధంగా తలమడుగు, కప్పర్‌దేవి, రుయ్యాడి తదితర గ్రామాల్లో ఆరు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ వనజరెడ్డి తెలిపారు.

తాంసి :గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తాంసి, భీంపూర్ మండలాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత రాత్రి నుంచి అతి భారీ వర్షాలు కురియడంతో భీంపూర్ మండలంలోని పెన్‌గంగా ప్రవహిక ప్రాంతాలు కరంజి, గుబిడి, అర్లి, అంతర్గాం గ్రామాల ప్రజలు పెన్‌గంగా ఉధృతి కారణంగా గ్రామాల చుట్టూ నీరు నిలిచి, ఎటు చూసినా వర్షపు నీరు నిలవడంతో పంటలు నీట మునిగాయి. ఇటు కరంజి గుబిడి గ్రామాల మధ్యలో ఉన్న వాగు ఉప్పొంగి పారడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాంసి మండలంలోని వడ్డాడి మత్తడి వాగు ప్రాజెక్టులోని సామర్థ్యానికి మించి నీరు చేరడంతో మూడు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలిపెట్టారు. హస్నాపూర్ రహదారి వాగు పొంగిపొర్లడంతో అదిలాబాద్ మహారాష్ట్ర రాకపోకలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులకు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నార్నూర్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శనివారం వాగులు, వంకలు ఉప్పొంగి పోర్లాయి. దీంతో ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఎర్పండింది. రోడ్లు కోతకు గురయ్యాయి. ఉమ్మడి మండలంలో భారీ వర్షంతో కునికాసా, కొత్తపెల్లి, చిత్తగడ, అర్జుని, మారుగూడ, దాబా(బి), దాబా(కే), లోకారి(కే), ఖడ్కి, ధర్మగూడ, కుండి షేక్‌గూడతో పాటు తదితర గ్రామాల ప్రజలకు వాగులు రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నార్నూర్ మండలంలోని మలంగి గ్రామపంచాయతీ పరిధిలోని బారిక్‌రావుగూడ వాసులు తాడు సహాయంతో వాగు దాటారు. చాలా చోట్ల లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగిపోయాయి. దీనితో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



ఆసిఫాబాద్: ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఆగస్టు రెండో వారంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇన్‌చార్జి కాంబ్లే బాలాజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దీనికోసం ఆగస్టు రెండో వారంలో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని, జిల్లా నుండి పెద్ద ఎత్తున ఎస్సీలు తరలిరావాలని కోరారు. ఐక్యంగా ఉన్నప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని, విశ్వరూపం ఏంటి అనేది ప్రభుత్వానికి తెలిసినప్పుడే సమస్యపై దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. విశ్వరూప మహాసభకు సంబంధించి ఈ నెల 28న కాగజ్‌నగర్ పట్టణంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తామన్నారు. దీనికి మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కొండ బ్రహ్మయ్య, జిల్లా కోకన్వీనర్ రేగుంట మహేష్, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ పిట్టల సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు రేగుంట సాగర్, జంగపెల్లి శేఖర్, సురేష్, బాలేష్, సునీల్, శ్యామ్ రావు, నరేష్, నరేందర్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలన

నిర్మల్ : జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శివారులోని నాగినాయిపేట్, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను శనివారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు, సదుపాయాలు, సమస్యల గూర్చి ప్రజలను అడిగితెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్డు మార్గం ఇబ్బందిగా ఉందని, తాత్కాలికంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. విద్యుత్ సరఫరాలో భాగంగా విద్యుత్ హైహోల్టేజ్‌లో సమస్య ఉన్నందున, వెనువెంటనే ఎలక్ట్రీసిటీ డీఈ సంబంధిత సిబ్బందితో దగ్గరుండి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి సమాచారం అందించాలని అన్నారు. పురపాలక సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 7993396793 కి కాల్ చేయాలని, 24 గంటలు సేవలు ప్రజానీకానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చైర్మెన్ వెంట కౌన్సిలర్లు మేడారం అపర్ణ, ప్రదీప్, బిట్లింగ్ నవీన్, అడప విజయలక్ష్మి పోశెట్టి, అదుముళ్ల రమాదేవి పద్మాకర్, ముజాయిద్ చౌస్, పాల్తె మహేందర్, కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈ, ఏఈ హరిభువన్, జాఫర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చూడాలి

కుభీర్ : ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా తయారు చేయాలని తహసీల్దార్ బి.విశ్వంబర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న బీఎల్ఓలకు జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ వెల్మల్ మధు, రఘువేంద్ర వర్మ ఇద్దరు కలిసి మండలంలో ఉన్న 52 బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వంబర్ మాట్లాడుతూ గ్రామంలో మిగిలిన కొత్త ఓటరు కార్డుల నమోదు, ఆధార్ అనుసంధానం చేసుకునే విధానం, అదే విధంగా ప్రస్తుతం ఉన్న ఓటరు కార్డులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసుకునే పద్ధతి, వాటిని వినియోగించే ఫారంల వివరాలను బూత్ లెవల్ అధికారులకు వాటిపైన అవగాహన కల్పించారు. దీంతో రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా ఓటరు లిస్టులను తయారు చేసేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్, డిప్యూటి తహసీల్దార్ పద్మావతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-తాంసి

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మత్తడి వాగు నిండుకుండలా మారింది. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురియడంతో మూడు గేట్లను ఎత్తి 15300 క్యుసెక్కుల నీటిని దిగువకు వదిలిపెట్టారు. ప్రాజెక్ట్ సామర్థ్యం 277.50 మీటర్లు కాగా 16500 క్యూసెక్కుల నీరు చేరడంతో ప్రస్తుత నీటి మట్టం 277.00 మీటర్లకు చేరిందని ప్రాజెక్ట్ అధికారి హరీష్ కుమార్ తెలిపారు. వర్షం ఏకధాటిగా కురిస్తే మరిన్ని గేట్లు ఎత్తుతామని పేర్కొన్నారు.

సారంగాపూర్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి స్వర్ణ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1183 అడుగులకు కాగా ప్రస్తుతం 1180 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 9200 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు రెండు గేట్ల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

కలెక్టర్ ప్రాజెక్టు సందర్శన

స్వర్ణ జలాశయాన్ని కలెక్టర్ వరుణ్‌రెడ్డి శనివారం సందర్శించారు. జలాశయంలోకి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భారీ వర్షాలకు దెబ్బతిన్న పొట్యా గ్రామ రోడ్డును పరిశీలించారు. ప్రాజెక్టు దిగువ గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ రామారావు, ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీఓ తిరుపతిరెడ్డి ఉన్నారు.


తాంసి : మత్తడి వాగు ప్రాజెక్టు

పెద్దవాగులో చిక్కుకున్న వ్యక్తిని రక్షించిన అధికారులు

రెబ్బెన : మండలంలోని పాసిగామ గ్రామ పంచాయతీలో వరదలగూడ గ్రామానికి చెందిన మంత్రి రాజయ్యను అధికారులు రక్షించారు. ఉదయం 8 గంటలకు పెద్దవాగు దాటి వ్యవసాయ పనులకు వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి వచ్చే క్రమంలో పెద్దవాగులో చిక్కుకున్నాడు. తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మోర్లె శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ శ్రావన్‌కుమార్ రెవెన్యూ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. కలెక్టర్ హేమంత్ బొర్కుడె, ఎమ్మెల్యే ఆత్రం సక్కు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో వరదలో చిక్కుకున్న మంత్రి రాజయ్యను బయటకు తీసుకొచ్చారు. వారి వెంట తహసీల్దార్ మల్లిఖార్జున్, సీఐ అల్లం నరేందర్, ఎస్ఐ భూమేష్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ సౌందర్య ఆనంద్, ఎంపీడీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.


సారంగాపూర్ : స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్


రెబ్బెన : వ్యక్తిని బయటకు తీసుకొచ్చిన గజ ఈతగాళ్లు

సహాయక చర్యలపై అప్రమత్తంగా ఉండాలి

- జూమ్ మీటింగ్ నిర్వహించిన ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జూమ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జెడ్పిటిసి, ఎంపీపీ లు, ఎంపిటిసిలు, సర్పంచులకు సూచనలు చేశారు. నది పరివాహక ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తినా వాటిని పరిష్కరించే దిశగా చూడాలని, పునరావాస కేంద్రాల్లోనూ అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయా గ్రామాల్లోని ప్రస్తుత పరిస్థితులను ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం వారికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యల్లో భాగస్వామ్యులు కావాలని సూచించారు. వాగులు, ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుందన్న ముఖ్యంగా నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లోనూ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.



ప్రమాదాలు జరగకుండా అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ - కాసిపేట

ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలపై అవగాహన కలిగి ఉండాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై రక్షణ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలను ముందస్తుగా గుర్తించడం, ప్రమాదాలను నివారించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య మాట్లాడుతూ గనిలో బాధ్యతగా మనకు మనమే రక్షణ పొందాలని, రక్షణ చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మందమర్రి జీఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్, సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ విధానాలను తెలుసుకోవాలని సూచించారు. సేఫ్టీపై అవగాహన కలిగి శిక్షణ పొంది ఉండేందుకు, సింగరేణి యాజమాన్యం శిక్షణ తరగుతులు ఏర్పాటు చేస్తుందని బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం గుప్తా పేర్కొన్నారు. అనంతరం కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యను యూనియన్ నాయకులు, అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏజెంట్ రాందాస్, మేనేజర్ అల్లావుద్దీన్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఏరియా రక్షణాధికారి రవీందర్, ఏరియా ఇంజనీర్ నాగరాజు, టీబీజీకేఎస్ నాయకులు బడికెల సంపత్, బన్న లక్ష్మణ్‌దాస్, వొడ్నాల రాజన్న, బండారు రమేశ్ పాల్గొన్నారు.

చలో కొత్తగూడెం కరపత్రాలు విడుదల

నవతెలంగాణ - రెబ్బెన

ఈ నెల 29, 30వ తేదీల్లో కొత్తగూడెంలో జరిగే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) 6వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 29న జరిగే బహిరంగ సభ కరపత్రాలను శనివారం గోలేటి క్రాస్ రోడ్డు వద్ద గల సీటీసీ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు తమ వేతనాలను కోల్పోయి సమ్మెలో పాల్గొన్నారన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కానీ, సింగరేణి యాజమాన్యం కానీ, కేంద్ర ప్రభుత్వం కానీ సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు చేసిందేమీలేదని పేర్కొన్నారు. జేబీసీటీఐలో చేసిన నిర్ణయాలను సింగరేణిలో అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా చేస్తోందన్నారు. 29న కొత్తగూడెంలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున కాంట్రాక్టు కార్మికులందరు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సమ్మె విచ్ఛిన్నం కుట్రలు మానుకోవాలి



నవతెలంగాణ - రెబ్బెన

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చేసే కుట్రలు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. కార్మికులకు 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మాత్రం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. శనివారం సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 11వ పీఆర్‌సీ అమలు చేయాలని, కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీవో నెంబర్ 51ని సవరించి జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గం వెంకటేష్, రాచకొండ రమేష్, శంకర్, శ్రీనివాస్, బాబాజీ, సత్యనారాయణ, దేవాజీ, లక్ష్మి పాల్గొన్నారు.

డీపీఓ ఆకస్మిక పర్యటన



నవతెలంగాణ-జన్నారం

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు శనివారం మండలంలోని రేండ్లగూడ, జన్నారం, పోనకల్ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి పనులను సక్రమంగా చేయించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సర్పంచ్, కార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం మల్టీపర్పస్ వర్కర్లు సమ్మెలో ఉన్న కారణాన పారిశుధ్య పనులు ఆపరాదని, వేరే ఇతర రోజువారీ కూలీలను తీసుకొని వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంటింటి నుండి చెత్త సేకరించాలని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, దోమల నివారణకు ఫాగింగ్ చేయించడం లాంటి పనులు కచ్చితంగా చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ రమేష్, పొన్కల్ ఈవో మహేష్, రేండ్లగూడ సర్పంచ్ ఆశారాజ్, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు ఉన్నారు.

మణిపూర్ దుండగులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మణిపూర్ దుండగులను కఠినంగా శిక్షించాలని మానవ హక్కుల వేదిక, మహిళా సంఘాలు, ప్రజా సంఘాల డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు నినాదాలు చేస్తు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మే 4న దారుణమైన ఘటన చోటు చేసుకుందని, పట్టపగలు కుకి తెగకు చెందిన గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి సమూహిక లైగింకదాడికి పాల్పడ్డ దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ సంఘటన సభ్య సమాజం సిగ్గుపడేలా చేయడం దారుణమని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక, మహిళా సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ఆత్రం భుజంగరావు, ఆత్రం సుగుణ, మూడుగు శామ్యూల్, జెడ్పీటీసీ చారులత, బిరుదుల లాజర్, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్, నాతరి రమేష్, రాథోడ్ గణేష్, చంద్రకాంత్, జాదవ్ సులోచన, రాధాబాయి, నీలాబాయి, కౌసల్య, అన్నపూర్ణ, రాజమణి, రాధా, ప్రజ్ఞశీల్, అబ్దుల్ ఖయ్యూం, సలీం, కొత్తపెల్లి మహేందర్, వెంకటేష్, సునీల్ ఉన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణ అఘాయిత్యాన్ని, లైంగిక దాడిని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దుండగులను శిక్షించాలని పేర్కొన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న మానవ హక్కులను హరించడంపై స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో వైరల్ అవుతున్న ఒక వీడియోతో అక్కడ జరుగుతున్న హక్కుల ఉల్లంఘన వెలుగులోకి వచ్చిందని తెలిపారు.

లోతట్టు ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించాలి

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పరిధిలో శిథిలావస్థకు చేరిన ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. శనివారం వేలాల శివారులో గోదావరి నదిని సందర్శించిన ఆయన వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఎగువ కురుస్తున్న వర్షాలతో దిగువకు వచ్చి చేరుతున్న వరద కారణంగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిరంతరాయంగా పారిశుధ్య పనులు కొనసాగాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రధానంగా గోదావరి వైపు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఆటో

నవతెలంగాణ - పెంచికల్‌పేట్

అదుపుతప్పి ఆటో చెట్టును ఢీకొన్న సంఘటన శనివారం జరిగింది. ఎస్ఐ కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన ఎల్లాల సత్యం ఆటో పెంచికల్‌పేట్ నుండి కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా పెంచికల్‌పేట్, బొంబాయిగూడ మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీట్టాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పోలీసు వాహనంలో క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. లోడ్‌పెల్లి గ్రామానికి చెందిన ముక్యార్ అహమ్మద్‌కు గాయాలయ్యాయి. భార్య సపోరా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నష్టపోయిన బాధితులను ఆదుకుంటాం

ఉట్నూర్ : గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ భరోసాను ఇచ్చారు. శనివారం మండలంలోని హిరాపూర్(జే), హీరాపూర్(పీ), తేజాపూర్, బలన్‌పూర్, దంతన్‌పల్లి, బీర్సాయిపేట్ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వరద బాధితుల ఇండ్లను పరిశీలించారు. గ్రామాలకు వెళ్లే దారిలో రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని అన్నారు. వర్షం కారణాంగా మండలంలోని పలు గ్రామాల్లో పంటలు తీవ్రంగా నష్టపోయారని, ఈ నష్టంపై వివరాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి నష్టాన్ని వివరించి, న్యాయం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట గ్రామస్తులు, బాధితులు ఉన్నారు.

తుడుం దెబ్బ ఆధ్వర్యంలో రాస్తారోకో

ఆదిలాబాద్‌టౌన్ : మణిపూర్ ఘటనను ఖండిస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో స్థానిక కుమురంభీం చౌక్‌లో శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ మాట్లాడుతూ ఆదివాసీ దమనకాండ కొనసాగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. బాధితుల పక్షాన నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ అమ్మాయిలను వివస్త్రను చేసి రోడ్లపై ఊరేగించడం సిగ్గుచేటని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వాలు స్పందించకపోవడం దుర్మార్గ చర్య అంటూ మండిపడ్డారు. సభ్య సమాజం ఇవాళ తలదించుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే నిందితులకు కఠిన శిక్షలు విధించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మొహర్రం పండగకు ఆర్థికసాయం

ఇంద్రవెల్లి: ఆదివారం నుండి కొలువుదీరే సవారి(పీరీలు)కి జడ్పీటీసీ అర్క పుష్పలత తనవంతు సాయంగా రూ.5వేలు అందజేశారు. ఇటీవలే భారీ వర్షాలు కురుస్తుండడంతో బంగ్లా పరిసర ప్రాంతం బురదమయంగా మారిందన్నారు. ఆ స్థలంలో మొరం వేసి చదును చేసేందుకు తనవంతు సాయం అందించినట్లు తెలిపారు.

పెద్దవాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దహెగాం : పెద్దవాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లద్ అన్నారు. శనివారం మండలంలోని బీబ్రా, ఐనం తదితర గ్రామాల్లో పెద్దవాగు పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడా ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో పాటు భారీ వర్షాల కారణంగా పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, సమీప గ్రామాల ప్రజలు చేపల కోసం, ఇతర పనుల కోసం పెద్దవాగు వద్దకు వెళ్లొద్దని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఎవరికైనా ఇబ్బందులు కలిగినట్టయితే సమాచారం అందించాలని అన్నారు. ఆయన వెంట వీఆర్ఏ విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పై ధనుశ్రీ

తలమడుగు : నాలుగు రోజుల నుండి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పై ధనుశ్రీ తెలిపారు. ఏఎస్ఐ సురేందర్‌తో కలిసి శనివారం పొంగి ప్రవహిస్తున్న పలు వాగులను పరిశీలించారు. తలమడుగు, రుయ్యాడి, సుంకిడి తదితర గ్రామాల వాగులను పరిశీలించారు. అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలని, అధిక వర్షాలతో వాగుల వంకలు పారడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

మహిళను వేధించిన కేసులో ఒకరిపై కేసు

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్‌లో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న మహిళ రేష్మాబేగంను ఫోన్‌లో వేధిస్తున్న సర్ఫరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. యూట్యూబ్ ఛానల్‌లో రిపోర్టర్‌గా పని చేసే సర్ఫరాజ్ కొంతకాలంగా తనను ఫోన్‌లో వేధిస్తున్నాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
5
ఆదివారం 23 జులై 2023

కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మందమర్రి పట్టణ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం శనివారం టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రఘునాథ్‌రెడ్డి, చెన్నూరు కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, భవిష్యత్ కార్యాచరణకు స్థానిక నాయకులకూ దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటా



నవతెలంగాణ-జన్నారం

కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉండాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఇందన్ పల్లి గ్రామానికి చెందిన తన కార్యకర్త కంటెం తిరుపతి భార్య అనారోగ్యంగా ఉండటంతో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే బలమని, వారికి అన్ని విధాల అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫజల్‌ఖాన్, కే.మల్లేష్, నరసింహులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

- బకాయి పడ్డ వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమకు బకాయి ఉన్న వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సంబంధిత ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. తెల్లవారుజామున ఐదు గంటలకే స్థానిక ఎల్లాగౌడ్‌తోటలోని వాటర్ ట్యాంక్ వద్ద హాజరు వేసే స్థలంలోనే నిరసన వ్యక్తం చేస్తూ బైటాయించారు. అనంతరం పది గంటలకు పట్టణంలోని పలు రహదారుల గుండా ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం చేరుకొని అక్కడ ధర్నా చేపట్టారు. వేతనాలు వెంటనే చెల్లించేవిధంగా చూస్తానని, కలెక్టర్‌తో మాట్లాడి ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యను కూడా పరిష్కరిస్తానని మున్సిపల్ కమిషనర్ హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ శంకర్, జి.సంజీవ్, కమిటీ సభ్యులు మల్లేష్, రమేష్, శంకరమ్మ, అశోక్, శోభ, లక్ష్మి, మల్లుబాయి, మహేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

మహిళల నగ్న ఊరిగింపు ఘటనకు కారకులను శిక్షించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మణిపూర్‌లోని కాంగ్‌పోక్పీ జిల్లాలో కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళల నగ్నంగా ఊరేగింపు ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనికి కారకులను వెంటనే కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని జై భీం కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడంతో పాటు వారిపై సామూహిక అత్యాచారం జరిగినట్లుగా, వారి కుటుంబసభ్యులను హతమార్చినట్లుగా వార్తలు వెలువడుతున్నాయని అన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని సూచించారు. ఆదివాసీ మహిళగా ఉన్న రాష్ట్రపతి ఈ ఘటనపై స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు దుర్గం తార, చునార్కర్ అరుణ, వగాడి సుశీల, ఉప్పురి కమల, సీహెచ్ రేణుక, వి.లావణ్య, వందన, మమత, సోని, తార పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఉరివేసుకొని ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నస్పూర్ పట్టణంలోని సుందరయ్య కాలనీలో చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగం మాన్విత్ (21) డిగ్రీ పూర్తి చేసి గత 6నెలలగా హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత 10 రోజుల క్రితం ఇంటికి వచ్చినపటి నుంచి ముభావంగా ఉంటూ ఇంట్లో ఎవరితో సరిగా మాట్లాడక పోయేవాడు. శనివారం ఉదయం ఇంట్లో వాళ్ళు లేచి చూడగా మాన్విత్ తన బెడ్రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కిందకు దించి చూసే సరికి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి తండ్రి కుమార స్వామి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఒర్రెలో కొట్టుకుపోయిన యువకుడు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బోర్డా గ్రామానికి చెందిన సెండె అంజన్న(20) శనివారం ఉదయం గ్రామ సమీపంలో గల ఒర్రె వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు ఒర్రెలో జారిపడి గల్లంతయ్యాడు. అంజన్నకు చిన్నప్పటి నుండే ఫిట్స్ వ్యాధి ఉండడంతో ప్రతిరోజు అతని తల్లిదండ్రులు బయటకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొనే వారని, తమ చేను పనుల నిమిత్తం శనివారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా ఇంటిలో ఎవరు లేకపోవడంతో బహిర్భూమికి బయటకు వెళ్లాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జారిపడిన సంఘటన స్థానికులు చూసి తహసీల్దార్ రహీమొద్దీన్, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, సర్పంచ్ రేణుకకు చెప్పడంతో సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటన గురించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుండే ఒర్రె పొడవున గాలింపు చర్యలు చేపట్టినా.. దాదాపు నాలుగు గంటల వరకు యువకుడి ఆచూకీ తెలియరాలేదు. ఎక్కడికి కొట్టుకుపోయాడో ఇప్పటికీ కూడా గ్రామస్తులు, ఈతగాళ్లు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కాగా తల్లిదండ్రులు ఆదె నాందేవ్-కమలాబాయికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరి కుమార్తెలకు వివాహం అయింది.

తుంపల్లి వాగుకు తాత్కాలిక మరమ్మతులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరద ప్రవాహంతో శనివారం తుంపల్లి వాగు చివరలో గత సంవత్సరం వేసిన తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో ఎంపీపీ మల్లికార్జున్ అక్కడికి చేరుకొని దగ్గరుండి మరమ్మతులు చేయించారు. జిల్లా కేంద్రం నుంచి తిర్యాని వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో అనునిత్యం వందలాది వాహనాలు వాగుపై నుండి వెళ్తాయి 6 గంటల పాటు ప్రవాహం ఉండడంతో వందలాది మంది ప్రజలు ప్రవాహ వేగం తగ్గడానికి ఎదురు చూశారు. ప్రవాహం తగ్గిన తర్వాత కొట్టుకుపోయిన రహదారి స్థానంలో ఎంపీపీ తాత్కాలిక మరమ్మతులు చేయించడంతో వాహనదారులు గమ్యస్థానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వాగుపై హై లెవెల్ వంతెన నిర్మిస్తే ప్రజల కష్టాలు తగ్గుతాయని తెలిపారు. వంతెన వద్ద తెగిన రహదారి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు.



మహా పడావ్‌ను విజయవంతం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఆగస్టు 9,10తేదీలలో జరిగే మహా పడావ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండి గౌస్‌లు కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరు లోకేష్, హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి మహేష్ అధ్యక్షతన మహాధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలన్నారు. ఏ ప్రభుత్వ రంగ సంస్థ కూడా ప్రభుత్వ ఆధీనంలో లేకుండా గంప గుత్తగా కొద్దిమంది ప్రయివేటు వ్యక్తులకు అమ్మడం వారి చేతుల్లో ఈ దేశ సంపదను పెట్టిడం ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు, కార్మిక రంగానికి తీవ్ర నష్టమని అన్నారు. ఇది ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఇటువంటి చర్యలను నిరసిస్తూ ఆగస్టు 9, 10 తేదీల్లో జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట నిర్వహించే మహా పడావ్ (మహాధర్నా) కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓదేలు పాల్గొన్నారు.

పేదలకు అండగా బాల్క ఫౌండేషన్

- మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజ్‌కుమార్



నవతెలంగాణ-భీమారం

పేదలకు అండగా బాల్క పౌండేషన్ చేయూతను అందిస్తోందని చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ధీన స్థితినిలో ఉన్న పలువురు నిరుపేద కుటుంబాలకు బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన దుర్గం సాంబయ్య మృతి చెందడంతో దశదిశ కర్మ కార్యక్రమానికి 50 కేజీల బియ్యం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా గత ఏడాది ఒకే కుటుంబానికి చెందిన పెద్దల మాంతయ్య, పోశంలు చెరువులో పడి మృతి చెందారు, దీంతో పోశం భార్య అనారోగ్యం భారిన పడి పక్షవాతం వచ్చి ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని తెలిసి బియ్యం అందించినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన భైరినేని చంద్రక్క గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూతనందిచామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దుర్గం మల్లేష్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మైదం సాయిబాబా, గట్టయ్య సోషల్ మీడియా, పళ్ళ మహేష్, ఆకుల రవి, సోదరి మల్లేష్, రైతు బందు అధ్యక్షులు గోదారి ప్రభాకర్, భీమారం ఎక్స్ ఎంపీటీసీ జల్లంపల్లి భూలక్ష్మి-తిరుపతి, గ్రామ యువకులు మనోహర్, దుర్గం శేఖర్, జాడి సుమంత్, ఆకుదారి బిక్షపతి, దుర్గం తరుణ్, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహం



నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ ప్రభుత్వం చదువులో ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులకు రూ.లక్ష 5వేల నగదు ప్రోత్సాహకాలను విద్యార్థులకు అందజేశారు. బెల్లంపల్లి సీఓఈలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని ఆయన కోరారు. గత విద్యా సంవత్సరంలో ఎన్ఐటీ, ట్రిబుల్ ఐటీ ప్రతిష్టాత్మక యూనివర్సిటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులకు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మంజూరు చేసిన చెక్కులను విద్యార్థులకు అందజేశారు. నగదు ప్రోత్సాహాన్ని అందుకున్న వారిలో ఆకుదారి ఆనంద్ కుమార్ (ట్రిపుల్ ఐటి సాయిరాజ్), (అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ బెంగళూర్),(విజ్ఞాన్ అగ్రికల్చర్ బీఎస్సీ వనపర్తి)చాపిడి అజయ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, మున్సిపల్ చైర్మన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, కన్నెపల్లి జడ్పీటీసీ సత్యనారాయణ, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనెటి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ యునుస్, విద్యార్థి నాయకులు రాజు, ప్రిన్సిపల్ సైదులు పాల్గొన్నారు.

వాగు దాటి వెళ్లేందుకు ప్రయత్నం చేయకండి



నవతెలంగాణ-జైనూర్

మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటే ప్రయత్నం చేయకూడదని తహసీల్దార్ సమీర్ హైమద్‌ఖాన్ అన్నారు. శనివారం మండలంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎంపీడీఓ ప్రభుదయ, ఎస్సై మధూకర్‌తో కలిసి మండలంలో వాగు, ప్రధాన రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజులు భారీ వర్షాలు ఉండడంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా జైనూర్ మండలకేంద్రం నుంచి గౌరీ కొలాంగూడ గ్రామానికి వెళ్లే రహదారి వద్ద గల వంతెన పైనుండి వరద ఉధృతిని పరిశీలించారు. ఇరువైపుల నుండి అధికారులను ఏర్పాటుచేసి రాకపోకలపై జాగ్రత్తలను తీసుకోవాలని ఆదేశించారు. ఎవరు కూడా ప్రమాదకరంగా వాగు దాటే ప్రయత్నం చేయకూడదని తెలిపారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపుకు కృషి చేస్తాం

- పీసీసీ సభ్యుడు డాక్టర్ గణేష్ రాథోడ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని పీసీసీ సభ్యులు డాక్టర్ గణేష్ రాథోడ్ అన్నారు. శనివారం స్థానికంగా ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం ఎన్నికల కమిటీ సభ్యునిగా మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావును ఎన్నుకోవడం పట్ల శుభసూచకమని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రస్తుతం పార్టీ ఇంకా బలంగా ఉందంటే కారణం ప్రేమ్‌సాగర్ రావు కారణమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో సర్వేలు చేపట్టి గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండి నియోజకవర్గంలో టికెట్ ఎవరికి వచ్చిన కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేస్తామన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎండీ నిజాం, ఇస్మాయిల్, నాగేష్ శంకర్, ప్రశాంత్, రషీద్, గౌతమ్, రాకేష్, పరశురాం, వామన్, గంధం శంకర్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అడ్వకేట్, సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజలింగు మోతె అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్రోల్, వంట గ్యాస్ ధరలు ఆకాశానంటాయని, వంట నూనెలు రికార్డ్ గరిష్టాన్ని అందుకున్నాయన్నారు. ఇప్పుడేమో టమాట, చింతపండు ధరలు అధిక ధరలు చూపిస్తున్నాయని, దీంతో సామాన్యుడి బతుకు, బడ్జెట్ తలకిందులైందని అన్నారు. నిత్యావసరాలు ఒక్కొక్కటి పోటా పోటీగా పెరుగుతున్నా కేంద్రం ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సామాన్యుడు బతుకు బండిని లాగడం కష్టమవుతుందన్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చాకిటి రమేష్, ఆవుల రమేష్ పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రక్రియపై రాజకీయ నాయకులకు అవగాహన



జన్నారం : ఓటింగ్ ప్రక్రియపై మండలంలోని రాజకీయ పార్టీల నాయకులకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆవగాహన కల్పించారు. తహసీల్దార్ కిషన్ ఓటు వేసే విదానాన్ని వారికి వివరించారు. అదేవిదంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఓటింగ్ ప్రక్రియపై ప్రజలకు ఆవగాహన కార్యక్రమాలు చేపటడతామని తెలిపారు. ఈవీఎం వివి ప్యాట్లపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటే ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు గోలిచందు, సీపీఐ మండల నాయకులు తిరుపతి, మండల ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

ఆగష్టు ఒకటిన ఛలో హైదరాబాద్

కాగజ్‌నగర్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆగష్టు ఒకటో తేదీన ఏబీవీపీ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఏబీవీపీ జిల్లా నాయకులు అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల ఉపకారవేతనాలను విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిని భర్తీ చేయాలని, మూసివేసిన 8,624 పాఠశాలలను తెరిపించాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలనే తదితర డిమాండ్లతో ఈ ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. హైద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించే భారీ బహిరంగసభలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

కర్వెతగూడ వంతెన పనులు పరిశీలించిన జడ్పీటీసీ

కెరమెరి : మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీ పరిధిలోని రావుజీ గూడ ఒర్రెపై చేపడుతున్న వంతెన పనులను జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి పరిశీలించారు. గత మూడు రోజు లుగా కురిసిన ఎడతెరపి లేని వర్షాలకు ఒర్రె ఉప్పొంగడంతో ఇరువైపులా రోడ్డు కోతకు గురైంది. వరద ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో ఒర్రె దాటేందుకు ప్రజలు ప్రయత్నించకూడదని సూచించారు. ఆమెతో పాటు ఎంపీటీసీ కోట్నాక సకరాం, కోవ లక్ష్మీ యూత్ కమిటీ నాయకులు సకరాం పాల్గొన్నారు.